ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 18 జూన్ 2024



దడ పుట్టిస్తున్న కూరగాయల ధరలు

- అమాంతంగా పెరిగిన వైనం
- 20 రోజుల్లోనే 30 శాతానికి పైగా పెరుగుదల
- వర్షాభావ పరిస్థితులతో తగ్గిన దిగుబడి
- కిలో రూ.80 నుంచి రూ.120 పలుకుతున్న పరిస్థితి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. ముఖ్యంగా సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంటోంది. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే జూన్‌లో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనంగా ఆర్థిక భారం పడుతుంది. పిల్లల పుస్తకాలు, స్కూల్ ఫీజులతో ఇబ్బందులకు గురవుతారు. ఇలాంటి పరిస్థితుల్లోనే ఇంటి బడ్జెట్‌ను తలకిందులు చేస్తూ కూరగాయల ధరలు కూడా సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో కూరగాయల ఉత్పత్తులు తగ్గిపోయాయి. పొరుగు రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడంతో ధరలు అమాంతం పెరిగాయి. గడిచిన 20 రోజుల్లోనే 25 నుంచి 30 శాతం వరకు కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. మరికొన్ని కూరగాయల ధరలైతే అమాంతం 50 శాతం పెరిగాయి. ఏ కూరగాయల ధర చూసినా కిలో రూ.80 నుంచి రూ.120 వరకు ధర పలుకుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుంటుండడంతోనే ధరలు పెరిగిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు పప్పుదినుసులతోనే సరిపెట్టుకునే పరిస్థితి ఏర్పడింది. సిరిసిల్ల జిల్లా కేంద్రానికి బోయిన్‌పల్లి, వేములవాడ, సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, మండలాలతోపాటు సిద్దిపేట, జిల్లాల నుంచి రైతులు కూరగాయలు అమ్మకానికి తీసుకొస్తారు. కూరగాయల ఉత్పత్తి పడిపోవడంతో దిగుమతి తగ్గిపోయిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

● వ్యాపారులకు ఇబ్బంది

కూరగాయల ధరలు పెరగడంతో సిరిసిల్ల మార్కెట్‌లో వ్యాపారాలు తగ్గిపోయాయి. దీంతో చిరు వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. హోల్‌సేల్ వ్యాపారుల వద్ద కూరగాయలు కొనుగోలు చేసి అమ్ముకునే వ్యాపారులు ధరలు ఎక్కువగా ఉండడంతో కొనుగోలు జరగడం లేదని ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరలతో కూరగాయల అమ్మకాలను కూడా తగ్గించుకోవాల్సి వస్తుందని పలువురు వ్యాపారులు తెలిపారు.

● ఘాటెక్కిన ఉల్లి, వెల్లుల్లి



కూరగాయల ధరలు మండిపోతుండగా అన్ని కూరల్లోకి అవసరమయ్యే ఉల్లి, వెల్లుల్లి గడ్డలు ఘాటెక్కి అందనంతగా పెరుగుతు న్నాయి. వారం రోజుల క్రితం కిలో రూ.25 ఉన్న ఉల్లిగడ్డలు రూ.40కు చేరింది. కిలో వెల్లుల్లి రూ. 200 ధర పలుకుతోంది. అల్లం కిలో రూ.200కు చేరింది. శాఖాహారంతోపాటు మాంహారం వంటల్లో అల్లం వెల్లుల్లి, వినియోగం ఎక్కువగా ఉంటుంది.

● తగ్గని కోడిగుడ్లు, చికెన్ ధరలు

పేద కుటుంబాలు కోడిగుడ్డు కూరతో సరిపెట్టుకుంటాయి. కొద్ది రోజులుగా కోడిగుడ్డు ధరలు, చికెన్ ధరలు కూడా తగ్గడం లేదు. ఒక కోడి గుడ్డును రూ.6 వరకు అమ్ముతున్నారు. చికెన్‌ధర రోజుకు రోజుకు పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం రూ.280కు కిలో విక్రయిస్తున్నారు.

● ధరల పెరుగుదలతో అదనపు భారం

జిల్లాలో కూరగాయల ధరల పెరుగుదలతో సామాన్య కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. ఒక కుటుంబంపై అదనంగా వెయ్యి రూపాయలపైనే భారం పడుతోంది. 20 రోజుల క్రితం వరకు టమాటా కిలో రూ.20 రూ.40 వరకు ఉండగా ప్రస్తుతం రూ. 60 నుంచి రూ.80కి చేరింది. పచ్చిమిర్చి కిలో రూ.80 నుంచి రూ.100, బెండకాయలు కిలో రూ.40 నుంచి రూ.60 వరకు, కాకర కిలో రూ.100, వంకాయలు కిలో రూ.80, పాలకూర కిలో రూ.80కు చేరుకుంది. క్యాబేజీ కిలో రూ.50, క్యారెట్ కిలో రూ.80, బీట్‌రూట్ రూ.50, మునక్కాయలు రూ.100, కొత్తిమీర రూ.200, ఆలుగడ్డలు రూ 40, గోరు చిక్కుడు రూ.80, బీరకాయలు కిలో రూ.120, దొండకాయలు కిలో. రూ.60కి చేరాయి. ఇతర కూరగాయల ధరలు కూడా రెండింతల నుంచి మూడింతలు పెరగడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు.



సిరిసిల్ల ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక బక్రీద్

● జిల్లా వ్యాప్తంగా ప్రార్థనలు

సిరిసిల్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను సోమవారం జిల్లాలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సిరిసిల్ల, సాయినగర్, వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్‌లో ఉన్న ఈద్గాల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పెద్దల సమాధుల వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. పేదలకు దానం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. బక్రీద్ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా వద్ద బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కార్యదర్శి మ్యాన రవితో పాటు ఇతర పార్టీల నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



వేములవాడలో పాల్గొన్న ముస్లింలు

చెరువును ఆక్రమిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, జూన్ 17: చెరువును ఆక్రమిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలోని ముదిరాజ్ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ గ్రామ శివారులోని పెద్ద చెరువు సమీపంలో హైదరాబాద్‌కు చెందిన కొందరు భూమిని కొనుగోలు చేసి శిఖం భూమిలో మట్టి పోస్తూ చదును చేస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు నీటి పారుదల, తహసీల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, చెరువును పూడ్చితే చర్యలు తప్పవని హెచ్చరించారని తెలిపారు. అధికారుల మాటలను పట్టించుకోకుండా స్థానిక రియల్టర్ల అండతో కబ్జా చేస్తున్నారన్నారు. చెరువులో చేపల పెంపకంతో సంఘంలోని 150 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయన్నారు. చెరువును ఆక్రమించడంతో నీటి నిల్వ తగ్గి జీవనోపాధి లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాను అడ్డుకునేందుకు యత్నిస్తే తమపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరారు. సంఘం సభ్యులు రాజం, రవి, రాములు, అంజయ్య, రమేశ్, సతీష్, రామచంద్రం, బాబు తదితరులు ఉన్నారు.

యోగాతో శారీరక, మానసికోల్లాసం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, జూన్ 17 : యోగా సాధన శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇస్తుందని సిరిసిల్ల పట్టణ సీఐ రఘుపతి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం విద్యానగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన యోగా పోటీలను సిరిసిల్ల పట్టణ సీఐ రఘుపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా సాధనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని, అప్పుడే విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని అన్నారు. జిల్లా స్థాయి యోగా పోటీలకు స్పందన వచ్చింది. పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ఆకునూరి వెంకటేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, న్యాయ నిర్ణేతలు కార్తీక్, ప్రణయ్, సృజన్, అఖిత, రిషాంత్, అశోక్, శ్రీకాంత్, కనకయ్య, చారి, రామానుజమ్మ, యోగా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సత్సంగ సదనంలో యజ్ఞం

ఎల్లారెడ్డిపేట, జూన్ 17: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనంలో సోమవారం జప ఏకాదశి సందర్భంగా జప యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు నవీన్‌చార్యులు ప్రవచనాలు వినిపించారు. అంతకు ముందు సత్సంగ సదనం అధ్యక్షుడు బ్రహ్మచారి లక్ష్మారెడ్డి భక్తిప్రవచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, మహదేవ్, ఆనందరెడ్డి, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, నర్సయ్య, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారు ఆశీర్వదించి వర్షాలు కురిపించాలి



రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవంలో భక్తులు



రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, జూన్ 17 : రేణుకా ఎల్లమ్మ అమ్మవారు ఆశీర్వదించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల పట్టణం మానేరు తీరన కొలువుదీరిన రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం సిరిసిల్ల పట్టణ గౌడ సంఘాల ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అంతకుముందు ఉదయం రేణుకాఎల్లమ్మ ఆలయంలో మహాయజ్ఞం, కుంకుమ పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవానికి హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రేణుకా ఎల్లమ్మను దర్శించుకొని ప్రత్యే పూజలు చేశారు. దేవాలయం కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. అనంతరం తీర్థ ప్రశాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ 12 ఏళ్ల కిత్రం సిరిసిల్ల పట్టణ గౌడ సంఘాల నాయకులు మానేరు తీరాన రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని నిర్మించి అమ్మవారిని ప్రతిష్ఠించారన్నారు. లోక కల్యాణం కోసం ఏటా అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అంతకుముందు చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సిరిసిల్ల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బైరి ప్రభాకర్, దేవాలయం కమిటీ అధ్యక్షుడు బుర్ర నారాయణగౌడ్, కౌన్సిలర్ చొప్పదండి లలిత, మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బుర్ర రాజు, గౌడ సంఘం నాయకులు బండారి శ్రీనివాస్‌గౌడ్, బాలసాని అంజయ్యగౌడ్, పర్కాల అంజయ్యగౌడ్, విక్రుత్తి పర్శరాములుగౌడ్, ఒల్యాల జగన్‌గౌడ్, బుర్ర రామచంద్రగౌడ్ పాల్గొన్నారు.

పక్కా భవనం నిర్మాణమెప్పుడో?

- అద్దె భవనంలో గురుకులం
- రహీంఖాన్‌పేటలో స్థలం కేటాయించి రెండేళ్లు



ఇల్లంతకుంటలోని అద్దెభవనంలో గురుకుల బాలికల పాఠశాల

ఇల్లంతకుంట, జూన్ 17: మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల భవనం అద్దె కష్టాలు ఇప్పట్లో తీరేలా కనిపించడం లేదు. ప్రభుత్వం గురుకుల విద్యాలయాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2016లో ఇల్లంతకుంటకు ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల మంజూరు చేసింది. అద్దె భవనాలు లభించడం లేదని అనేక సంవత్సరాలు వేములవాడలో కొనసాగింది. స్థానిక నాయకుల ఒత్తిడి మేరకు ఇల్లంతకుంటలోని అద్దెభవనంలోకి మార్చారు. అద్దెభవనంలో సరైన వసతులు లేవని విద్యార్థులు ఆందోళన చేపట్టడంతో చిన్నజియ్యర్‌స్వామి ట్రస్ట్ భవనంలోకి మార్చారు. ఇక్కడ కొంత కాలం కొనసాగిన తర్వాత భవనానికి ప్రహరీ లేదని, పాఠశాలలోకి పాములు వస్తున్నాయని పేర్కొంటూ కరీంనగర్‌కు పాఠశాలను తరలించారు. స్థానిక నాయకులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టినా పాఠశాల తరలింపును అడ్డుకోలేకపోయారు. రెండు సంవత్సరాల అనంతరం 2021లో ఇల్లంతకుంటలో అద్దెభవనం లభించడంతో గురుకుల పాఠశాల తిరిగి వచ్చింది. ప్రస్తుతం 565 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇప్పుడు కొనసాగుతున్న అద్దె భవనంలో వసతులు ఉన్నా పక్కాభవనం ఉంటే బాగుంటుందని తల్లిదండ్రులు కోరుతున్నారు. గత ప్రభుత్వం గురుకుల పాఠశాలకు రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల వెనకాల 5 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు నాయకులు ప్రకటించారు. పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మాత్రం మంజూరు కాలేదు. ప్రభుత్వం నిధులు కేటాయించి పక్కాభవనాన్ని నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పక్కా భవనం నిర్మించాలి



- దేశెట్టి శ్రీనివాస్, వెల్జిపూర్

ఇల్లంతకుంటలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలకు పక్కా భవనాన్ని నిర్మించాలి. గురుకుల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇంటర్మీడియెట్ విద్య కొనసాగుతోంది. రహీంఖాన్‌పేటలో కేటాయించిన స్థలంలో నూతన భవనానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ప్రస్తుతం రోడ్డుపక్కనే భవనం ఉండడంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. గురుకుల పాఠశాలలో ప్రయోగశాలలు సైతం ఏర్పాటు చేయాలి. అప్పుడే సరైన విద్య అందుతుంది.

నేడు రైతు నేస్తం సదస్సులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 17: వానాకాలం సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై మంగళవారం రైతు నేస్తం సదస్సులు నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట, వేములవాడ పరిధిలోని హన్మాజీపేట రైతు వేదికల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11.10 గంటల దాకా వీడియో కాన్ఫరెన్స్‌లో విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులు, రైతుల అనుభవాలు, శాస్త్రవేత్తలు సలహాలు అందిస్తారని వివరించారు. జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు విధుల్లో చేరనున్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ టౌన్, జూన్ 17: సెలవుల్లో వెళ్లిన వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తిరిగి మంగళవారం విధుల్లో చేరనున్నారు. ఈవో కృష్ణప్రసాద్ వైద్య సేవల కోసం సెలవు తీసుకున్నారు. దీంతో జూన్ 5వ తేదీ వరకు ఆలయ ఇన్‌చార్జి ఈవోగా రామకృష్ణను నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం జూన్ 5వ తేదీ వరకు ఉన్న ఇన్‌చార్జి బాధ్యతలను జూన్ 16వ తేదీ వరకు పొడిగించింది. ఆలయ ఇన్‌చార్జి ఈవోగా రామకృష్ణ బాధ్యతలు ఆదివారం ముగిశాయి.

మొక్కులు చెల్లించుకున్న బీజేపీ నాయకులు

కోనరావుపేట, జూన్ 17 : పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్ అత్యధిక మెజారిటీతో గెలుపొందడం, కేంద్ర మంత్రిగా పదవి రావడంతో బీజేపీ నాయకులు సోమవారం గంభీరావుపేట మండలంలోని రామాలయంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. కోనరావుపేట మండలానికి చెందిన బీజేవైఎం, బీజేపీ జిల్లా నాయకులు మిర్యాల్‌కార్ బాలాజీ, గంగుల బాలకిషన్, దాసరి అరవింద్ తదితరులు ఉన్నారు.

ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సులు

సిరిసిల్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సినిమాటోగ్రఫీ రంగంలో ఆరు నెలలపాటు ఉచిత డిప్లొమా కోర్సులు అందిస్తున్నట్లు సిగ్మా అకాడమీ చైర్మన్ ఎంసీ శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా జూలై 15 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 8008021075 నంబరులోగానీ శాప్ ఇండియా ఆర్గనైజింగ్ వెబ్‌సైట్‌లోగానీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

కోడె మొక్కుల రాజన్నకు కోటి దండాలు

- భక్తజన సంద్రంగా వేములవాడ క్షేత్రం
- క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు
- స్వామివారి దర్శనానికి 4 గంటల సమయం



ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు

వేములవాడ టౌన్, జూన్ 17 : హర హర మహాదేవా.. శంభో శంకర.. కోడెమొక్కుల రాజన్నకు కోటి దండాలు అంటూ రాజన్న నామస్మరణతో వేములవాడ దేవస్థానం పరిసరాలు మార్మోగాయి. సోమవారం రాజ రాజేశ్వర స్వామిని దర్శించుకోవడానికి మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాజన్న క్షేత్రానికి భక్తుల తాకిడి పెరగడంతో ఆలయ ఆవరణలో సందడి నెలకొంది. క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు స్వామివారిని దర్శించుకొని తరించారు. కోడెమొక్కు చెల్లించుకునే భక్తులు క్యూలైన్‌లో సుమారు 4 గంటలపాటు నిరీక్షించారు. గండాలు తలగిపోవాలని గండాదీపంలో నూనె పోస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాలైన బద్దిపోచమ్మ, నగరేశ్వర, భీమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో అభిషేక పూజలను రద్దీ చేశారు. సోమవారం పార్వతీ పరమేశ్వరులను దర్శించుకునేందుకు 50 వేల మందికిపైగా భక్తులు వచ్చినట్లు, రూ.30 లక్షల వరకు ఆయా విభాగాల ద్వారా ఆదాయం సమకూరినట్లు ఆలయాధికారులు అంచనా వేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ సూపరింటెండెంట్‌లు సిరిగిరి శ్రీరాములు, తిరుపతిరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● రాజన్న దర్శనం స్వగ్రామాలకు భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో సోమవారం సాయంత్రం భక్తులు ఒక్కసారిగి తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండుకు తరలిరావడంతో రద్దీగా మారిపోయింది. కరీంనగర్, వరంగల్, హన్మాకొండ, సికింద్రాబాద్, కోరుట్ల, మెట్‌పల్లి బస్‌స్టాప్‌ల వద్ద భక్తులు, ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించారు. ఆర్టీసీ బస్సుల రాకా ఆలస్యం కావడంతో భక్తులకు తిరుగు ప్రయాణంలో ఇక్కట్లు తప్పడం లేదు.



క్యూలైన్‌లలో బారులుదీరిన భక్తులు


స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన నరసింహుడి ఆలయం

ధర్మపురి, జూన్ 17: ధర్మపురి లక్ష్మీనరసింహుడి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి తోడుగా సెలవు దినం కావటం వల్ల ఉదయం వరకు క్షేత్ర నలుమూలల నుంచి భక్తులు చేరుకున్నారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం స్వామి వారి ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేసి అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం చేయించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి జలంతో అభిషేకం జరిపి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు అందంగా పూలతో స్వామి వారలను అలంకరించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామ వేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, అభిషేక్ పౌరోహితులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

జమ్మికుంట రూరల్, జూన్ 17: హోంగార్డు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. జమ్మికుంట మండలం కోరపల్లి శివారులో ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ ఆపి పేపర్లు పరిశీలించారు. అవి సరిగా లేక పోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించాలని హోంగార్డు రవీందర్‌ను ఆదేశించారు. టాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా, మార్గ మధ్యలో శ్రీదేవి రైస్ మిల్లు వద్ద ట్రాక్టర్ యాజమాని అడ్డుకొని హోంగార్డును కిందకు దించి ట్రాక్టర్‌ను తీసుకు వెళ్లాడు. విధులకు ఆటంకం కలిగించిన సంఘటనలో డ్రైవర్ అనిల్‌కుమార్, యాజమాని నాగరాజు, బండ అరవింద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

పిల్లలను కాపాడబోయి.. నీటిలో మునిగి తండ్రి మృతి

ఇద్దరు పిల్లలను కాపాడిన జాలర్లు



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, మృతుడు విజయ్‌కుమార్ (ఇన్‌సెట్లో)

తిమ్మాపూర్, జూన్ 17: నీటిలో మునిగిపోతున్న పిల్లలను కాపాడబోయి ఓ తండ్రి ప్రాణాలు కోల్పోయాడు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అసిస్టెంట్ పే అండ్ అకౌంట్స్ (వర్క్ అండ్ ప్రాజెక్టు) డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న బంగారి విజయ్ కుమార్ (47) తన కుటుంబంతో కలిసి కరీంనగర్‌లోని సంతోష్‌నగర్‌లో నివాసముంటున్నాడు. విజయ్ కుమార్ భార్య ప్రశాంతి, కూతురు సాయినిత్య, కుమారుడు విక్రాంత్, అత్త పుష్పలతతో కలిసి సోమవారం ఉదయం హుస్నాబాద్‌లోని పొట్లపల్లి శివాలయానికి వెళ్లారు.

దర్శనం అనంతరం తిరుగుప్రయాణంలో దిగువ మానేరు జలాశయం వద్దకు వెళ్లారు. కాకతీయ మెయిన్ కెనాల్ దిగువకు నీటిని విడుదల చేసే రెగ్యులేటరీ వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో రెగ్యులేటరీ సమీపంలో ఉన్న స్టాండింగ్ పాయింట్ వద్దకు వెళ్లిన సాయినిత్య ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయింది. సాయినిత్యను కాపాడేందుకు విజయ్‌కుమార్ నీటిలో దూకాడు. వీళ్లను చూసిన కుమారుడు విక్రాంత్ కూడా నీళ్లలోకి దూకాడు. అతడూ మునిగి పోవడం ప్రారంభించాడు. వారిద్దరిని విజయ్‌కుమార్ గట్టువైపునకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించాడు. గట్టున ఉన్న విజయ్‌కుమార్ భార్య ప్రశాంతి కాపాడండి అంటూ కేకలు వేసింది. అక్కడికి సమీపంలో ఉన్న శంకర్ అనే జాలరి గమనించి వెంటనే వారి వద్దకు వెళ్లి పిల్లలను బయటకు తీసుకువచ్చాడు. అప్పటికే అలిసిపోయిన విజయ్‌కుమార్ నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. సమాచారం అందుకుని సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. విజయ్ కుమార్ భార్య ప్రశాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎల్ఎండీలో మునిగి విజయ్‌కుమార్ మృతి చెందిన సంఘటన తెలిసిన వెంటనే మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకున్నారు. విజయ్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పిల్లలను కాపాడిన శంకర్‌ను ఎమ్మెల్యే అభినందించారు.





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, పిల్లలను కాపాడిన జాలరి శంకర్

పాడి రైతుకు దిగాలు!

- రోజు రోజుకీ తగ్గుతున్న ఆవు పాల ధరలు
- ఇన్సెంటివ్, ప్రభుత్వ ప్రోత్సాహం కరువే
- ఆవేదన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు, డెయిరీ నిర్వాహకులు



డెయిరీలోని ఆవులు

మల్యాల, జూన్ 17: ఆవు పాల ధరలు రోజురోజుకీ తగ్గడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలు వెచ్చించి నిర్వహిస్తున్న డెయిరీలను మరింతగా ప్రోత్సాహించాల్సింది పోయి పాల ధరలు తగ్గిస్తూ ఆవేధనకు గురి చేస్తున్నారు. క్షీర విప్లవంలో భాగంగా కొన్నాళ్ల క్రితం వరకు గ్రామాల్లో డెయిరీలను ప్రోత్సహించడంతో అనేక మంది ఆవులు, గేదెల ఫామ్‌లు ఏర్పాటు చేశారు. వాటి నుంచి నిత్యం పాలను సేకరిస్తూ ధరలకు అదనంగా ఇన్సెంటివ్, ప్రభుత్వ ప్రోత్సాహాన్ని పాడి రైతులకు ఇచ్చేవారు. అయితే ఇటీవల వాటిని ఎత్తివేయడమే కాకుండా ఎప్పుడూ చెల్లించే పాల ధరలను తగ్గించడంతో తమకు డెయిరీల నిర్వహణ భారంగా మారిందని దిగాలు చెందుతున్నారు. ఆవులు, గేదేలకు అందించే దాణ ఇతర రాత్రా ఖర్చులు పెరుగుతుండడానికి అనుగుణంగా పాల ధరలను కూడా క్రమేపీ పెంచాల్సింది పోయి తగ్గించడం సరికాదని ఇలాగైతే తాము డెయిరీలను మూసుకోవడమే శరణ్యమని అంటున్నారు.

● ఎనిమిది నెలల్లో రూ.7 తగ్గింపు

లీటర్ ఆవు పాలకు గత సెప్టెంబర్, అక్టోబర్ నెలలో కరీంనగర్ డెయిరీ వాళ్లు రూ.43చెల్లించగా ప్రస్తుతం రూ.35.65మాత్రమే ఇస్తు న్నారని దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని పాడి రైతులు తెలిపారు. లీటర్‌కు దాదాపు రూ.7కు పైగా తగ్గిందని ఇలాగైతే నిర్వహణ ఎలా అంటూ ఆవేదన చెందుతున్నారు. 50లీటర్లు ఆపై పాలు సేకరిస్తే లీటర్‌కు రూ.35.65తో పాటు రూ.1, 100లీటర్లకు రూ.2 ఇలా పాలు పెరిగిన కొలది ఇన్సెంటివ్ పెంచుతూ వాటిని అందిం చేవారు. అయితే ఇటీవల అందించడం లేదని పైగా పాల ధరలను కూడా గణనీయంగా తగ్గిస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. మల్యాల మండలం తాటిపల్లితో పాటు పలు గ్రామాల్లో, రాయికల్, జగిత్యాల తదితర మండలాలల్లో డెయిరీలు ఉండగా కొన్ని చోట్ల కరీంనగర్ డెయిరీ వాళ్లు వందలాది లీటర్ల పాలు సేకరణ చేస్తున్నా రు. అయితే ఇటీవల ధరలు తగ్గించడంతో నిర్వహణ భారంగా మా రుతుందని లీటర్‌కు రూ.7వరకు తగ్గుదలతో అప్పులతో డెయిరీలను మూసివేయడమే శరణ్యమని అంటుండగా కొన్నాళ్ల క్రితం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ధరల పెంపునకు కృషి చేయాలని కోరారు.

అలాగే ప్రభుత్వం లీటర్ పాలకు చెల్లించే రూ.4 ప్రోత్సాహం కొన్నేళ్లేగా రావడం లేదని పాడి రైతులు అంటున్నారు. ఇటీవల వెన్న శాతం తక్కువ వచ్చే వారికి కోతలు గతంలో కన్నా రెట్టింపు చేయడం మరింత ఆందోళనకు గురి చేస్తోందని పేర్కొంటున్నారు. మరింత ప్రోత్సాహించాల్సింది పోయి మూసివేసుకునే రీతిలో వ్యవహరిస్తున్నరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆవు పాల దిగుమతులు పెరుగడంతోనే ధరలు తగ్గిస్తున్నట్లు తెలుస్తుంది. కరీంనగర్ డెయిరీ సూపర్ వైజర్ మహిపాల్ రెడ్డిని సంప్రదించగా ధరల పెంపు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ తామని తెలిపారు.

ధర తగ్గింపుతో నష్టం..: తూకుంట్ల రవీందర్‌రెడ్డి, తాటిపల్లి



పాల ధరలను తరచూ తగ్గించడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. దాణా, నిర్వహణ ఖర్చులు పెరు గుతున్న నేపథ్యంలో పాల ధరలను కూడా పెంచాల్సి ఉండగా పెంచకపోవడంతో అప్పుల పాలు కావాల్సి వస్తోంది. ధరల తగ్గింపుతో నా ఒక్కనికే దాదాపుగా రూ.30వేల వరకు నష్టపోవాల్సి వస్తుందంటే మిగితా వాళ్లు ఎంత నష్టపోతున్నారో తెలుస్తుంది. ధరలను పంచడమే కాకుండా ఇన్సెంటివ్, ప్రోత్సాహం అందించి ఆదుకోవాలి

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

మృతదేహం కోసం తండ్రి, భార్య వర్గాల మధ్య గొడవ



గొడవలో తలకు గాయంతో మృతుడి భార్య స్వాతి

కరీంనగర్ క్రైం, జూన్ 17: భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా కరీంనగర్ శివారులోని చంద్రాపూర్‌కాలనీలో వల్లపు స్వామి(36) ఆది వారం రాత్రి 11 గంటలకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్వామి మృతదేహానికి సోమవారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కరీంనగర్ రూరల్ పోలీసులు పంచనామా, పోస్టుమార్టం నిర్వహించారు. కాగా మృతదేహాన్ని తామే తీసుకువెళతామని మృతుడి భార్య, కాదు తామే తీసుకువెళతామని మృతుడి తండ్రి వర్గాలకు చెందినవారు గొడవపడ్డారు. ఒకరిపై ఒకరు రాళ్లతో కొట్టుకోగా మృతుడి భార్య స్వాతితోపాటు ఇరువర్గాలకు చెందిన మరి కొందరికి గాయాలయ్యాయి. పోలీసులు ఇరువర్గాలను చెరగొట్టి అక్కడి నుంచి పంపించివేశారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన వల్లపు స్వామి, తన భార్య స్వాతి, ఇద్దరు పిల్లలతో కలిసి ఆరు నెలల కిందట కరీంనగర్‌కు వచ్చి చంద్రాపూర్ కాలనీలో నివాసం ఉంటూ కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అయితే తరచుగా స్వామి, స్వాతి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 15న స్వామిభార్య పుట్టింటికి(కొత్తగూడెం) వెళ్లి పిల్లల సర్టిఫికెట్లు తీసుకుని ఆదివారం కరీంనగర్‌కు వచ్చింది. అయితే అక్కడ ఉన్న కోళ్లు, బియ్యం ఎందుకు తీసుకురాలేదని స్వామి రాత్రి 9 గంటలకు తన భార్యతో గొడవపడి ఆమెను కొట్టాడు. దీంతో అతని భార్య సమీపంలోని బంధువుల ఇంటిలో పిల్లలతో కలిసి నిద్రించింది. అప్పటికే మద్యం సేవించి ఉన్న స్వామి రాత్రి 11 గంటలకు తన బంధువులకు వీడియోకాల్ చేసి తాను చనిపోతున్నానని చెప్పి మద్యం మత్తులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమీపంలో ఉన్న బంధువులు వచ్చి చూసేసరికి స్వామి ఉరికి వేళాడుతూ కనిపించాడు. ఈ విషయం మృతుడి భార్య బంధువు లకు తెలిపింది. సోమవారం ఉదయం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం మృతదేహం తీసుకువెళ్లే విషయంలో ఇరువర్గాలు గొడవపడ్డారు.

స్వామికి దామెరలో ఇళ్లులేదని, అక్కడ కార్యక్రమాలు నిర్వహించటం కష్టమవుతుందని మృతుడి భార్య స్వాతి, ఆమె సోదరులు వాదిస్తూ స్వామి మృతదేహాన్ని వరంగల్ జిల్లా నర్సంపేట వద్ద కొత్తగూడకు తీసుకువెళతామని పట్టుబట్టారు. అయితే తన కొడుకు మృతదేహాన్ని తన గ్రామం దామెరకే తీసుకువెళతామని తండ్రి జంపయ్య, మృతుని సోదరులు పట్టుబట్టారు. ఈ గొడవలో ఒకరిపై ఒకరు రాళ్లతో కొట్టుకున్నారు. అక్కడే ఉన్న ఒక అంబులెన్స్ అద్దాలు కూడా రాళ్ల దెబ్బకు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి మృతుడి తండ్రి జంపయ్యకు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, జూన్ 17: ఒంటిపై వేడినీళ్లు పడి కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామగిరి యాదగిరి (64) ఆదివారం మృతిచెందాడని రెండో టౌన్ పోలీసులు తెలిపారు. సప్తగిరి కాలనీకి చెందిన యాదగిరి ఈ నెల 7న ఉదయం స్నానం కోసం వేడినీళ్లు తీసుకెళ్తూ జారి కిందపడగా వేడి నీళ్లు అతని ముఖం, ఇతర చోట్ల పడి గాయాలయ్యాయి. అతన్ని కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి, హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చిప్పలపెల్లిలో రెండిళ్లలో చోరీ

ముస్తాబాద్, జూన్ 17: మండలంలోని చిప్పలపెల్లి గ్రామంలోని రెండిళ్లలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాడిచర్ల నర్సవ్వకు చెందిన ఇంట్లో రూ. 1.85 లక్షలు, తులం వెండి, గాడిచర్ల నరేశ్ ఇంట్లో బంగారు గుండ్లు, చెవుల కమ్మలు, చిన్న చెవికమ్మలు, దాదాపు రెండు తులాల వెండి పట్టగొలుసులు, రెండు జతల వెండి బ్రాస్ లెట్, చిన్న పిల్లల పట్టగొలసులు, నడుము వెండి ఎత్తుకెళ్లారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నేత కార్మికుడి మృతి



శేఖర్(ఫైల్)

తంగళ్లపల్లి, జూన్ 17: తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిడాల శేఖర్ (55) అనే నేత కార్మికుడు మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రం ఇందిరనగర్‌కు చెందిన నేత కార్మికుడు శేఖర్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. పద్మనగర్ శివారులో ప్రమాదవ శాత్తు ద్విచక్రవాహనం అదుపు తప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా ఆదివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు: ముగ్గురికి గాయాలు

మానకొండూర్, జూన్ 17: మండలంలోని ఈదులగట్టెపల్లి-ఖాదర్‌గూడెం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళుతున్న టీఎస్ 09 జెడ్ 8112 ఆర్టీసీ బస్సును వరంగల్ నుంచి ఎదురుగా వస్తున్న టీఎస్ 02 ఈహెచ్ 5683 నుంబరు గల కారు ఢీకొంది. కారు వెనకాల వస్తున్న బైక్ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న శివకుమార్, అతని భార్య నితీష, బైక్‌పై వస్తున్న లక్ష్మణ్ గాయపడ్డారు. క్షతగాత్రులను కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

గల్ఫ్ నకిలీ ఏజెంట్ ఇంటి ఎదుట బాధితుల నిరసన



గల్ఫ్ ఏజెంట్ ఇంటి ముందు నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబాలు

కోనరావుపేట, జూన్ 17: విదేశాలకు పంపిస్తానని పలువురిని మోసం చేసి గల్ఫ్ నకిలీ ఏజెంట్ ఇంటి ఎదుట బాధితులు సోమవారం నిరసనకు దిగారు. బాధితుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన గల్ఫ్ నకిలీ ఏజెంట్ చెలిమెల అలియాస్ చందనగిరి తిరుపతి విదేశాలకు పంపిస్తానని పలువురి వద్ద 10 లక్షల రూపాయలు వసూలు చేశాడు. ఏడాదిన్నర గడిచినా పంపించక పోవడంతో బాధితులు కుటుంబసభ్యులతో సహా ఏజెంట్ ఇంటి వద్దకు చేరుకున్నారు. ధర్మారం గ్రామానికి చెందిన వెంగలి దేవయ్య, తాళ్లపల్లి రాజు, వెంగలి నవీన్, ఊరడి రాములు, కొలనూరుకు చెంది న బత్తిని రమేష్, నిజామాబాద్‌కు చెందిన ఊరడి మధు, పిట్టల రవిని యూరప్ పంపిస్తానని 10 లక్షల రూపాయలు వసూలు చేశాడని ఆరోపించారు. తమకు చెప్పకుండా దుబాయ్ వెళ్లిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లించడానికి తిరుపతి గడువు కోరడంతో బాధితులు శాంతించారు.

ఆటో, బైక్ ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు

మానకొండూర్, జూన్ 17 : మండలంలోని పెద్దూరుపల్లి గ్రామంలో సోమవారం ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దూరుపల్లి నుంచి మన్నెంపల్లి వైపు వెళుతున్న ఆటో, ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొన్నాయి. ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న తిమ్మాపూర్ మండలంలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన దొంత బాబు, మంద శ్రీనివాస్ తీవ్రగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తి తగదాలో మూకుమ్మడి దాడి

ఒకరి మృతి
ఎనిమిది మందిపై కేసు నమోదు

కోరుట్ల రూరల్, జూన్ 17 : కుటుంబ సభ్యుల మధ్య నెల కొన్న ఆస్తి తగాదా ఒకరి ప్రాణాలను బలి తీసుకుంది. మండలంలోని మోహన్‌రావుపేటలో సోమవారం కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఒక్కరిపై దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలై రాజేష్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు... బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కోరుట్ల మండలంలో మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన కోట గంగరాజంకు ఇద్దరు కుమారులు కోట రాజేష్, కోట రాకేశ్ ఉన్నారు. గ్రామంలో ఉన్న ఆస్తి పంపకంపై కొన్ని రోజులుగా వీరి మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం గంగరాజం కుటుంబ సభ్యులు సమీప బంధువులతో ఆస్తి పంపకం విషయమై మరో మారు సమావేశం అయ్యారు. పంపకాల విషయంలో ఉదయం నుంచి పలు మార్లు రాజేష్‌ను సముదా యించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో అక్కడే ఉన్న తమ్ముడు రాకేష్ కోపోద్రిక్తుడై కత్తితో రాజేష్‌పై దాడికి పాల్పడ్డాడు. అదే సమయంలో తండ్రి గంగరాజంతో పాటు బంధువులు రాజేష్‌పై దాడి చేయడంతో అప్పటికే రాజేష్ అపస్మారకస్థితికి వెళ్లాడు. దీంతో అక్కడే ఉన్న రాజేష్ భార్య లాస్య గ్రామస్థుల సహకారంతో హుటా హుటిన కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు బంధువులు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో రాజేష్ మృతి చెందాడు.



రాజేష్ (ఫైల్)

గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలాన్ని కోరుట్ల సీఐ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్ తన సిబ్బందితో పరిశీలన జరిపారు. రాజేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాజేష్ హత్య కేసులో ఎనిమిది మందిపై కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. సోదరుడు రాకేష్‌తో పాటు తండ్రి గంగరాజంతో పాటు బాబాయిలు మంచాల రాజేశం, కోట గంగారాజం, లిం గంపల్లి నరేష్ (రాకేష్ స్నేహితుడు), కోట మానస, కోట మల్లు, మంచాల లక్ష్మిలపై కేసు నమోదు చేశారు.

చెరువు మట్టి హాంఫట్!

- అనుమతికి మించి అక్రమ తరలింపు
- పట్టించుకోని ఇరిగేషన్, మైనింగ్ అధికారులు

మల్యాల, జూన్ 17: చెరువు మట్టి అక్రమంగా తరలుతోంది. అధికారులు, నాయకుల అండదండలతో అనుమతికి మించి తరలిస్తున్నారు. ఇటుకబట్టీలకు వేలాది క్యూబిక్ మీటర్ల మట్టి అక్రమంగా తరలుతున్నపట్పటికీ ఇరిగేషన్, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లక్షలాది రూపాయల విలువ చేసే మట్టి అక్రమార్కులకు వరంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. మల్యాల మండలం బల్వంతాపూర్ శివారులో గల రేణికుంట చెరువు నుంచి మట్టిని గత రెండు రోజులుగా అనుమతికి మించి అక్రమంగా తరలిస్తుండడంతో గ్రామస్థులు ఆదివారం డయల్ 100కు, ఇరిగేషన్ అధికారులకు పిర్యాదు చేశారు. అయినప్పటికీ మట్టి తరలింపు కొనసాగడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



టిప్పరులో తరలిస్తున్న మట్టి

● అనుమతికి మించి తరలింపు..

రేణికుంట చెరువులో మట్టిని వెయ్యి క్యూబిక్ మీటర్ల వరకు తరలింపునకు కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తికి అనుమతి ఇచ్చారు. 1.2మీటర్ల లోతు తవ్వకాలతో కేవలం ఆరు వాహనాలలో మాత్రమే తరలించడానికి ఇరిగేషన్ ఈఈ ఆర్డర్ ఇచ్చారు. అయితే ఆదివారం దాదాపు 30 వాహనాలలో మట్టిని తరలించారని అనుమతికి మించి మట్టిని తీస్తున్నారని గ్రామస్థులు పోలీస్‌శాఖ 100 డయల్‌కు ఫిర్యాదు చేశారు. అనుమతులు ఉన్నాయంటూ సదరు పోలీసులు వెళ్లి పోయారని స్థానికులు తెలిపారు. వారం రోజులుగా ఇదే ప్రాంతం నుంచి మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను, అయిదు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం ఆరు వాహనాలకే అనుమతి ఉన్నప్పటికీ పదుల సంఖ్యల వాహనాల్లో తరలిస్తున్న పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని దీంతో ప్రభుత్వం సీనరేజిని కోల్పోతుండగా అక్రమార్కులకు చెరువు మట్టి కల్ప తరువుగా మారిందని పేర్కొం టున్నారు.

చర్యలు తీసుకుంటాం
: తిరుపతి, డీఈ, ఇరిగేషన్

అనుమతికి మించి తరలిస్తే తగు చర్యలు తీసుకుంటాం. ఆరు వాహనాలకే అనుమతి ఇవ్వడం జరిగింది. మట్టి తవ్వకాలు ఎక్కువగా చేస్తే క్యూబిక్ మీటర్ల వారీగా ఫీజు వసూలు చేయడం జరుగుతుంది. ఎక్కువ తవ్వకాలు చేయకుండా పరిమితికి మించి వాహనాల్లో తరలుకుండా అక్కడే ఉండే తమ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం.

ఫోర్ లైన్‌కు మోక్షమెప్పుడో?

- ప్రమాదకరంగా కొదురుపాక -నందికమాన్ రోడ్డు
- తరచూ ప్రమాదాలతో ఆందోళన
- రోడ్డు విస్తరణ చేపట్టాలని వాహనదారుల డిమాండ్



నాంపల్లి ఘాట్ రోడ్డు సమీపంలో ప్రమాదకరంగా రహదారి

వేములవాడ టౌన్, జూన్ 17 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తారు. ముఖ్యంగా వరంగల్, హన్మకొండతోపాటు కరీంనగర్ ప్రాంతాల నుంచి వచ్చే వారు అధికంగా ఉంటారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ప్రయాణిస్తుంటాయి. కరీంనగర్ నుంచి కొదురుపాక వరకు ఫోర్‌వే లైన్ రోడ్డు పూర్తయ్యింది. సిరిసిల్ల నుంచి వేములవాడకు నాలుగు వరుసల రోడ్డు పనులు పూర్తయ్యాయి. కానీ కొదురుపాక గ్రామం నుంచి నాంపల్లి నందికమాన్ వరకు ఫోర్ వే రోడ్డు మంజూరు కాకపోవడం, రోడ్డు చిన్నగా ఉండడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

కొదురుపాక గ్రామం నుంచి ప్రధాన రహదారిని ఆనుకొని పునరావాస కాలనీలు ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి కాలనీలు వెలిశాయి. దీంతో రోడ్డు కాస్తా రద్దీగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోర్ వే లైన్ మంజూరు చేయాలని స్థానికులు పలు మార్లు అధికారులు, ప్రజానిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఫోర్ వే లైన్ రోడ్డుకు మాత్రం మోక్షం లభించలేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నాలుగు వరసల రోడ్డు మంజూరు చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహన దారులు, స్థానికులు కోరుతున్నారు.

ఆరు నెలలో ముగ్గురు మృతి..

కొదురుపాక శివారు నుంచి నాంపల్లి నందికమాన్ చౌరస్తా వరకు రోడ్డు చిన్నగా ఉండడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నాంపల్లి ఘాటు రోడ్డు సమీపంలో ఇటీవల డీసీఎం వ్యాన్, లారీ ఢీకొన్న ప్రమాదంలో సిరిసిల్ల పట్టణానికి చెందిన బాపురెడ్డి అనే డీసీఎం వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరెపల్లి గ్రామంలో చీర్లవంచ గ్రామానికి చెందిన దేవారాజు అనే యువకుడు, రుద్రవరం గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన పర్శరాములు అనే వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డారు. తరచూ రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయాల పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆర్అండ్ బీ, పోలీస్ అధికారులు బారికేడ్లు, సూచిక బోర్డులు ఏర్పా టు చేసినప్పటికీ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, రోడ్డు విస్తరణ పనులు చేపట్టి నివారించాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణతోనే ప్రమాదాల నివారణ
మేర్గు లక్ష్మణ్, వాహనదారుడు, నాంపల్లి



కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారి నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. రాత్రి పూట వాహనాలు ఎక్కువగా వస్తుంటాయి. రోడ్డు చిన్నగా ఉండడంతో నాంపల్లి ఘాటు రోడ్డు సమీపంలో మూలమలుపు ప్రమాదకరంగా మారింది. రోడ్డును విస్తరిస్తే తప్పా రోడ్డు ప్రమాదాలను నివారించలేం.

ద్విచక్రవాహనంపై వెళ్లాలంటే భయం
పండుగ శంకర్, వాహనదారుడు, సంకెపల్లి



సంకెపల్లి గ్రామం నుంచి వేములవాడకు ద్విచక్రవాహనంపై వెళ్లాలంటే భయంగా ఉంటుంది. వాహనాల రద్దీ పెరిగింది. రోడ్డు చిన్నగా ఉంది. ఆరెపల్లి నుంచి నందికమాన్ వరకు రోడ్డుకు ఇరువైపుల గ్రామాలు ఉండడంతో రోడ్డు చుట్టూ నిత్యం ప్రజలు, వాహ నాలతో బిజీబిజీగా కనిపిస్తుంది. ఫోర్‌లైన్ రోడ్డును వీలైనంత త్వరగా చేపడితే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్టు వేయవచ్చు.

ఫోర్‌వే నిర్మించాలి: కాసర్ల అరుణ్, రుద్రవరం



రుద్రవరం సమీపంలో రోడ్డుకు రెండు వైపుల ఇళ్లు ఉంటాయి. అటు వైపు వెళ్దామంటే భయంగా ఉంటుంది. రోడ్డుపైన స్పీడ్‌ను కంట్రోల్ చేసేందుకు స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలి. వాహనాలు స్పీడ్‌గా వెళ్లడంతో వాటి వేగాన్ని అంచన వేయకుండా రోడ్డును దాటేందుకు ప్రయత్నిస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫోర్ వే లైన్ రోడ్డును వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలి.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



యాగం నిర్వహిస్తున్న విద్యారణ్య భారతీస్వామి

ఎల్లారెడ్డిపేట, జూన్ 17: ద్వేషం వీడితేనే మానవ జీవితం ధన్యమవుతోందని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి ప్రబోధించారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని బాల త్రిపుర సుందరీ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం శత చండీయాగం, కుంభాభిషేకం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారణ్య భారతీ స్వామి ఆధ్యాత్మిక ప్రవచనలు చేశారు. ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి డబ్బు వ్యామోహంలో పడి సాటి మానవులను మరిచిపోతున్నారన్నారు. క్షమాగుణం లేకుండా పోతోందన్నారు. మానవులు దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హర్యానా గవర్నర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

రుద్రంగి, జూన్ 17: హర్యానా రాష్ట్రంలోని రాజ్ భవన్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను మంగళవారం బీజేపీ నాయకులు కలిశారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్ సన్మానించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వేములవాడ టౌన్, జూన్ 17 : వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మర్రిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 2014-15 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పదేళ్ల తర్వాత ఒక చోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమా మమస్రష్, లచ్చిరెడ్డి, లక్ష్మీనారాయణ, విజయ్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మరిమడ్లలో టార్పాలిన్ల అందజేత

కోనరావుపేట, జూన్ 17 : కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో పలు పేద కుటుంబాలకు రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ సిరిసిల్ల సౌజన్యంతో సోమవారం టార్పలిన్ కవర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ కుమార్ మాట్లాడుతూ వర్షకాలంలో ఇళ్లపై కప్పడానికి అందజేసినట్లు చెప్పారు. రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు గుడ్ల సునీల్, ప్రభాకర్ రావు, వేణు ఉన్నారు.

దొంగ పట్టివేత

వేములవాడ టౌన్, జూన్ 17 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గ్రామంలోని పంటపొలాల్లో సోమవారం ఓ వ్యక్తి మోటార్ల విద్యుత్ వైరు దొంగతనం చేయగా రైతులు పట్టుకున్నారు. తిప్పాపూర్‌కు చెందిన గడ్డం కృష్ణ, సాయి, ఎల్లయ్యకు సంబంధించిన విద్యుత్ వైరును దొంగలించాడు. అక్కడే విద్యుత్ వైరును కాల్చి అందులో నుంచి వచ్చిన రాగి వైరును దొంగలించగా పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తిప్పాపూర్ గ్రామానికి చెందిన మైలారం శ్రీనివాస్ తెలిపాడు.

మహిళ అదృశ్యం

వీర్నపల్లి, జూన్ 17: వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన పాటి పూల అనే మహిళ శనివారం నుంచి అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు సోమవారం తెలిపారు. పొలం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఇప్పకాయ ఏరేందుకు వెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం అటవీ ప్రాంతంలో వెతికినట్లు పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



సీసీ రోడ్డు కింద కోతకు గురైన మట్టి

ఎల్లారెడ్డిపేట, జూన్ 17: ఎల్లారెడ్డిపేట శివారులోని సత్సంగ సదనం నుంచి కోరుట్లపేట గ్రామాల మధ్య ఉన్న వ్యవసాయ సాగు కాలువపై పైపులు వేసి నిర్మించిన సీసీ రోడ్డు కింద మట్టి రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. వరద ఉధృతికి రహదారి కింద ఉన్న మట్టి కొట్టుకుపోయింది. పైకి రోడ్డు బాగానే ఉన్నా కింద మాత్రం ప్రమాదకరంగా మారింది. భారీ వాహనాలు ప్రయాణిస్తే ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పలుమార్లు సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రహదారి కింద కనీసం మట్టిని పోయించలేరని వాహనదారులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి రహదారికి మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

- ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- పోలీసుల బందోబస్తు



వేములవాడలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఇల్లంతకుంట, జూన్ 17: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ సందర్భంగా సోమవారం ఇల్లంతకుంట, రేపాక తదితర గ్రామాలలోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల నూర్‌భాషా సంఘం అధ్యక్షుడు మహమ్మద్ సలావుద్దీన్, ఆసీఫ్‌రజా, ముంషాద్, నయీం, సాదుల్, అజీం, మైమూద్, అలీం, కుర్షిద్, రెహాన్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: బక్రీద్ సందర్భంగా గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు నారాయణపూర్, బొప్పాపూర్, గొల్లపల్లి, వెంకటాపూర్, బండలింగంపల్లి, తదితర గ్రామాల్లోని ఈద్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుర్బానీ పంపిణీ చేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, ముస్లిం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల వ్యాప్తంగా బక్రీద్‌ను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదుల్లో మతపెద్దలు ప్రత్యేక సందేశం ఇచ్చారు. అనంతరం ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మదీన మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండెపల్లి తదితర గ్రామాల్లో బక్రీద్ జరుపుకున్నారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు హమీద్ మౌలానా, అక్రమ్ రాజా, ఇమామ్ జానీ గౌసొద్దీన్, సలీం, ఖాసీం, హైదర్‌బాబా, ఇమామ్ ఖలీద్, అల్లా బక్ష బాబా, అమీర్ పాల్గొన్నారు.

కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ముస్లింలు సోమవారం బక్రీద్‌ను జరుపుకున్నారు. కో ఆప్షన్ మెంబర్ అబ్దుల్ రషీద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, ఎండీ ఘనీ, మాజీ కో ఆప్షన్ యాకూబ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

సోదర భావంతో మెలగాలి



వేడుకల్లో ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్: హిందూ, ముస్లింలు సోదర భావంతో మెలగాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో ముస్లింలు నిర్వహించిన బక్రీద్ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధనిక, పేద భేదాభిప్రాయాలు లేకుండా ముందుకు సాగాలని సూచించారు.

వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలో సోమవారం బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని రెండో బైపాస్‌లోని ఈద్గా వద్దకు పట్టణానికి చెందిన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జామ మసీద్ ఇమామ్ బోధనలు వినిపించారు. ప్రతీ ఒక్కరు దాన, సేవాగుణాలు అలవర్చుకోవాలని తెలిపారు. ప్రార్థనల అనంతరం ముస్లీంలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఖుర్బానీని చుట్టుపక్కల వారికి దానంగా అందించారు. మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఏర్పాట్లు చేశారు. టౌన్ సీఐ వీరప్రసాద్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అక్రం, మసీద్ అధ్యక్షులు షేక్ ఇమామ్, తహేర్‌పాషా, లాయక్ పాషా పీర్ మహ్మద్, అంజద్‌పాషా ఉన్నారు.

- వేములవాడ మండలంలోని సంకెపల్లి, నాంపల్లి, ఇస్లాంనగర్, తిప్పాపూర్, శాత్రాజుపల్లి గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బక్రీద్ సందర్భంగా ముస్లింలు మసీద్ వద్ద ప్రార్థనలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందో బందోబస్తు ఏర్పాటు చేశారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలో ముస్లింలు సోమవారం బక్రీద్ వేడుకలను జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జడ్పీటీసీ నాగం కుమార్ ముస్లింలకు ఈద్గా వద్ద పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జోగాపూర్ ఎంపీటీసీ మ్యాకల గణేష్, నాయకులు ధర్మపురి శ్రీనివాస్, బొజ్జ మల్లేశం, పులి సత్తయ్య, బాణాల రవీందర్ రెడ్డి, సలీం, అజీమ్, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ



బొప్పాపూర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చందుర్తిలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

బతుకమ్మ చీరల యారన్ సబ్సిడీ తగ్గించవద్దు



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల రూరల్, జూన్ 17 : బతుకమ్మ చీరలను తయారు చేసిన మరమగ్గాల కార్మికులకు అందించే పదిశాతం యారన్ సబ్సిడీని తగ్గించవద్దని, పాత పద్ధతిన కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. సోమవారం వేములవాడలో ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్‌కు ఆయన నివాసంలో యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు వినతి పత్రాలను అందజేశారు. గతంలో అందించిన మాదిరిగా కాకుండా కూలీపైన 20 శాతం లెక్కించడం ద్వారా ఒక్కో కార్మికుడు వేలాదిరూపాయలు ఎలా నష్టపోతున్నారో లెక్కలతోసహా వివరించారు. దీంతో ప్రభుత్వం విప్ స్పందించి చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు సమస్యను వివరిస్తానని, సబ్సిడీ పెంచి అందించే విధంగా చూస్తాని హామీ ఇచ్చారు. అనంతరం నాయకులు మాట్లాడూతూ ఆదిశ్రీనివాస్ హామీ ప్రకారం చర్యలు తీసుకుంటారని నమ్ముతున్నామన్నారు. కార్మికులకు నష్టం జరిగితే పోరాటాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్స్‌టైల్ పార్క్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్, అక్కల శ్రీనివాస్, సుకంటి మహేష్, వేముల రాజశేఖర్, దూడం సంపత్, కందికట్ల శ్రీనివాస్, మేఘ అంజనేయులు, మామిడాల శ్రీనివాస్, పులిరమేష్, పోగుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

సిరిసిల్ల రూరల్, జూన్ 17 : రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల్లో సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందని, గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా పదివేల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఈ పదోన్నతులో భర్తీ చేయడం లేదని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అన్నారు. సిరిసిల్లలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ప్రాథమిక స్థాయి పునాది వంటిదని, ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. పదోన్నతుల షెడ్యూల్‌లో కామన్ సీనియార్టీని పరిగణలోకి తీసుకొని భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి రమేష్, జిల్లా కోశాధికారి పర్కాల రవీందర్, జిల్లా కార్యదర్శులు కోత్వాల్ ప్రవీణ్, జంగిటి రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



భూమిపూజలో జడ్పీటీసీ మ్యాకల రవి

వేములవాడ టౌన్, జూన్ 17 : వేములవాడ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని జడ్పీటీసీ మ్యాకల రవి అన్నారు. మండలంలోని అనుపురంలో సోమవారం గౌడ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుపురం గౌడ సంఘం భవనానికి జడ్పీ నిధుల నుంచి రూ.3 లక్షలు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో సీడీపీ నుంచి వచ్చిన రూ.3 లక్షలు కలిపి రూ.6 లక్షలతో పనులు ప్రారంభించామన్నారు. గ్రామంలో అన్ని కుల సంఘాల భవన నిర్మాణాలకు తన వంతు కృషి చేశానని, మిగిలి ఉన్న కుల సంఘాల భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. త్వరలోనే కుల సంఘాల భవనాలకు నిధులు మంజూరు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కొండపల్లి వెంకటరమణరావు, ఎర్రం రాజు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్ల టౌన్, జూం 17 : వ్యవసాయ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వేణు మాట్లాడారు. గత ఎన్నికల ప్రణాళికలో భాగంగా వ్యవసాయ కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఆ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తామన్న వాగ్దానం అమలు కాకపోవడం బాధాకరం అన్నారు. అదే విధంగా సామాజిక పింఛన్ రూ.4వేలకు పెంచడం, మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సహాయం చేస్తామన్న వాగ్దానాలు నేటికి అమలుకు నోచుకోవడం లేదన్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సామాజిక భద్రత పథకం కింద పింఛన్ రూ. 4వేలు అమలుకు శ్రీకారం చుట్టారన్నారు. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కూలీల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కొందరు కూలీలకు ఇప్పటికి వంద రూపాయలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కూలి అందకపోతే ఎలా బతుకుతారన్నారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 పెంచినట్లుగా చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని ఆరోపించారు. అందుకే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి తగినట్టుగా నిధులు కేటాయించాలని, సంవత్సరానికి 200 రోజులు పని కల్పిస్తూ రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పట్టణ ప్రాంతాల్లో సైతం ఉపాధిహామీ పనులు కల్పించాలని, సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కోనరావుపేట, జూన్ 17 : కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మృతుల కుటుంబాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. కనగర్తి గ్రామానికి చెందిన సోలుపటి శ్రీనివాస్‌రెడ్డి, కురుసాని తిరుపతి, నిమ్మపెల్లిలో వికృతి ఎల్లయ్య గౌడ్, వట్టిమల్లలో ముత్తవ్వ, జెట్టి రాజయ్య, మామిడిపల్లిలో బడుగు కిరణ్ కుటుంబాలను పరామర్శించారు. కాంగ్రెస్ జిల్లా మండల నాయకులు కచ్చకాయల ఎల్లయ్య, చేపూరి గంగాధర్, గొట్టే రుక్మిణి, ఫిరోజ్ పాషా, తాళ్లపెల్లి ప్రభాకర్, నందు గౌడ్, మానుక సత్యం, నాగండ్ల భూమేష్, లింగారెడ్డి ఉన్నారు.

చందుర్తి: చందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని, మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. మండలంలోని మర్రిగడ్డకు చెందిన లక్కె పద్మ రోడ్డు ప్రమాదంలో గాయపడగా పరామర్శించారు. అనంతరం ఇటీవల మరణించిన గ్రామానికి చెందిన కత్తి భూమయ్య, పుల్లూరి ముత్తయ్య, బండ రంజిత్, పన్యాల రామచంద్రారెడ్డి, సంకోజి బాలలింగం, వాసం లస్మవ్వల, చందుర్తి మండల కేంద్రానికి చెందిన బత్తుల ముత్తయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు గొట్టె ప్రభాకర్, దూది శ్రీనివాస్ రెడ్డి, జలపతి, బాలు, సత్యం తదితరులు ఉన్నారు.

గోదాములకు రక్షణ కరువు

- విరిగిపోయిన గేట్లు - మందుబాబులకు అడ్డాగా మారిన వైనం



చెట్లపొదల్లో పడి ఉన్న గేట్లు



ప్లాట్‌ఫాంపై ఖాళీ మందు సీసాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 17: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులోని ధాన్యం నిల్వ చేసేందుకు ప్రభుత్వం నిర్మించిన గోదాములకు రక్షణ కరువైంది. చుట్టు ప్రహరీ ఉన్న ప్రధాన ద్వారం గేట్లు విరిగిపోయి చెట్ల పొదల్లో పడి ఉన్నాయి. గోదాములు మందుబాబులకు అడ్డాలుగా మారాయి. రైతుల వద్ద నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గత ప్రభుత్వం రూ.3 కోట్లతో మండలంలోని బొప్పాపూర్ శివారులో గోదాములను నిర్మించింది. సంబంధిత శాఖ అధికారులు భారీ స్థాయిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేశారు. ప్రధాన ద్వారం గేట్లు విరిగిపోవడంతో వాటిని ఓ మూలన చెట్లపొదల్లో పడేశారు. పర్యవేక్షణ లేకపోవడంతో మందుబాబులు గోదాం ఆవరణలోకి చేరుకుంటున్నారు. ఎక్కడ చూసినా ఖాళీ మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. తినేందుకు వినియోగించిన ప్లేట్లు, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయాయి. మద్యం మత్తులో గోదాముల ఆవరణలో ఖాళీ సీసాలను పగులకొడుతున్నారు. గోదాములకు రక్షణ లేకుండాపోయింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించాలని, విరిగిపోయిన గేట్లను మరమ్మతు చేయించి బిగించడంతోపాటు మందుబాబులు లోనికి రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రేపు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రాక

- బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి కరీంనగర్‌కు..

భగత్‌నగర్, జూన్ 17: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బుధవారం కరీంనగర్‌కు రానున్నారు. 19న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లిద్దరు కరీంనగర్ రావాలని భావించినా అదే రోజు కేంద్ర కేబినెట్ భేటీ ఉండడంతో కిషన్ రెడ్డి ఢిల్లీలోనే ఉండాల్సి వచ్చింది. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి బండి సంజయ్ కరీంనగర్‌కు రానుండడంతో ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధమయ్యారు. 19న శనిగరం వద్ద స్వాగతం అనంతరం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం, చైతన్యపురిలోని తన మాతృమూర్తి ఆశీస్సులు తీసుకుని కొండగట్టువెళ్లనున్నారు. చొప్పదండి నియోజక వర్గంలోని నాయకులు, కార్యకర్తలతో భేటీ అనంతరం నల్లగొండ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయాన్ని దర్శించుకోనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు వేములవాడ రాజ రాజేశ్వర స్వామి దర్శనం అనంతరం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించనున్నారు. ఏడు గంటలకు సిరిసిల్ల మార్కండేయ ఆలయంలో పూజలు నిర్వహించనున్నారు. అనంతరం సిరిసిల్ల నియోజకవర్గ నాయకులను కలుసుకుంటారు. 20న మధ్యాహ్నం వరకు కరీంనగర్‌లో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం హైదరాబాద్ వెళ్లి కేంద్ర మంత్రికిషన్‌రెడ్డితో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 21న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మానకొండూర్, హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. 22న కరీంనగర్‌లోని శివాలయం, రామేశ్వరాలయం, భగత్‌నగర్ అయ్యప్ప ఆలయాన్ని సందర్శిస్తారు. అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 24 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభంకానుండడంతో 23న ఢిల్లీ వెళ్తారు.

మూతపడిన వాటర్ ప్లాంట్

- నిర్వాహకుడు లేకపోవడంతో తాళం
- గ్రామస్థుల ఇబ్బందులు



నిమ్మపల్లిలో మూసి ఉన్న వాటర్ ప్లాంట్

కోనరావుపేట, జూన్ 17: శుద్ధ జల కేంద్రం నిర్వహణ లేకపోవడంతో మూతబడింది. దీంతో శుద్ధ జలం అందక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో అప్పటి ఎమ్మెల్యే రమేష్‌బాబు సహకారం, గ్రామపంచాయతీ నిధులతో శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మూడు నెలల క్రితం వరకు శుద్ధ జలాన్ని సర్పంచుల పదవీకాలంలో అందజేశారు. సర్పంచుల పదవీకాలం ముగిసిన నెల రోజులకే వాటర్ ప్లాంట్ మూతపడింది. శుద్ధ జల కేంద్రాన్ని నడిపించేందుకు గ్రామ పంచాయతీ సిబ్బంది లేకపోవడంతో కేంద్రం నిర్వహణ కరువైంది. దీంతో మూడు నెలలుగా మూత పడడంతో శుద్ధ జలం కోసం గ్రామంలోని ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల వద్ద నీటిని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. శుద్ధ జల కేంద్రాన్ని నడపడానికి మనిషి లేకపోవడంతో మూతపడిందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని, వాటర్ ప్లాంట్ నిర్వహణ కోసం ఒకరిని నియమించాలని, శుద్ధ జల కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

మూడు నెలలుగా ఇబ్బందులు

- మల్యాల దేవయ్య, నిమ్మపల్లి

వాటర్ ప్లాంట్ మూడు నెలలుగా మూతపడడంతో తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నాం. నిర్వాహకుడు లేక వాటర్ ప్లాంట్‌ను మూసివేశారు. మిషన్లు అన్ని బాగానే ఉన్నాయి. నిర్వాహకుడు లేకపోవడంతో మూతపడింది.

రెండు రోజుల్లో ప్రారంభిస్తాం

- అనిల్, పంచాయతీ కార్యదర్శి

రెండు రోజుల్లో వాటర్ ప్లాంట్ ప్రారంభించి గ్రామస్థులకు శుద్ధ జలాన్ని అందిస్తాం. కొన్ని రోజులుగా బోరు నీరు సరిపోకపోవడంతో నడిపించలేకపోయాం. నిర్వాహకుడిని ఏర్పాటు చేసి ప్రారంభిస్తాం.